సాక్షి
నిజామాబాద్
గురువారం । 5 । జూన్‌ । 2025




# సాగు సందడి

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే రావడంతో జిల్లాలో సాగు సందడి నెలకొంది. వర్షాలు కురవడం ప్రారంభం కాగా.. రైతులు వ్యవసాయ భూములను దున్ని పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. మరో వైపు కొన్ని ప్రాంతాల్లో వరినాట్లు ప్రారంభమయ్యాయి. మొత్తానికి రైతులు వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యారు. ఎక్కడ చూసినా వ్యవసాయభూములు సాగు పనులతో కళకళలాడుతున్నాయి. చందూర్, వర్ని తదితర మండలాల పరిధిలో వరినాట్లు వేస్తున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్


చందూరు శివారులో వరినాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు


చందూరు వద్ద నారు తీసుకెళ్తున్న మహిళారైతు

## న్యూస్‌రీల్

### డీసీసీబీ సేవలకు ఐఎస్‌వో గుర్తింపు



నిజామాబాద్ సిటీ: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కస్టమర్లకు అందిస్తున్న సేవలకు గాను ఐఎస్‌వో ధ్రువీకరణ పత్రం అందజేసినట్లు చైర్మన్ రమేశ్‌రెడ్డి తెలిపారు. జిల్లాకేంద్రంలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో బుధవారం పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. డీసీసీబీ అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తున్నందుకు, బ్యాంకు నిర్వహణ, ఖాతాదారులకు బ్యాంకు ద్వారా అందిస్తున్న విలువైన సేవలకుగాను ఐఎస్‌వో ధ్రువీకరణ పత్రం (9001 : 2015) జారీ చేసిందన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి నిర్వహించిన ఆడిట్‌లో బ్యాంకు మంచి ఆర్థి క ఫలితాలు సాధించి, అన్ని విభాగాల్లో మె రుగైనట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆడిట్ స్కోర్ 90 సాధించామని, బ్యాంకు చరిత్రలో మొదటి సారని పేర్కొన్నారు. డైరెక్టర్లు, సీఈవో నాగభూషణం ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



నిజామాబాద్ అర్బన్: ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న ఈవీఎం గోదాము ను అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాము సీల్‌ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌లు, ఎన్నికల సామగ్రిని భద్రపర్చిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. వారి వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సిబ్బంది సాత్విక్, విజయేందర్ తదితరులు ఉన్నారు.

### కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



నిజామాబాద్ రూరల్: కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏం అలీం హైమద్ స్పష్టం చేశారు. నగర శివారులోని సారంగాపూర్ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్‌తో పాటు జిల్లా కేంద్రంలోని విత్తన, పురుగు మందుల దుకాణాలను టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలిసి ఏడీఏ బుధవారం పరిశీలించారు. దుకాణాల్లోని స్టాక్, బిల్లు రిజిస్టర్లు, విత్తన బస్తాల లాట్ నంబర్లను పరిశీలించారు. లైసెన్స్ డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. రైతులు విత్తన రసీదులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి జాదవ్ హీరా, సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ నాగేశ్, ఎస్సై మహేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### మీనాక్షి నటరాజన్‌తో జిల్లా నేతల సమావేశం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో సమావేశమయ్యారు. ఇందులో భాగంగా జిల్లాకు చెందిన, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలకు పరిశీలకులుగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, రాంభూపాల్‌లు మీనాక్షికి తమ నివేదికలను అందజేశారు. కేటాయించిన జిల్లాల్లో తాము నిర్వహించిన సమావేశాలు, సేకరించిన వివరాలను పూర్తిస్థాయిలో వివరించారు. ఒక్కొక్కరితో క్షుణ్ణంగా మాట్లాడిన మీనాక్షి అన్ని విషయాలను కూలంకషంగా అడిగి తెలుసుకున్నట్లు నాయకులు పేర్కొన్నారు.

# డ్రోన్ పెట్రోలింగ్

- నగరంలో త్వరలో ప్రారంభించనున్న పోలీసు శాఖ
- ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్‌కు ఒక్కోటి..
- డ్రోన్ కెమెరాలు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం
- ముందుగా సమస్యాత్మక పోలీస్‌స్టేషన్ల పరిధిలో అమలు



ఖలీల్‌వాడి: ప్రజలకు భద్రతను పెంచేందుకు పోలీసు శాఖ ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగిస్తోంది. సమస్యాత్మక ప్రాంతాల్లో ఆకతాయిల ఆగడాలు, గొడవలు, గుంపులుగా గుమిగూడిన చోట్ల ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పోతరాజు సాయిచైతన్య నిజామాబాద్ నగరంలో డ్రోన్ మొబైల్ పెట్రోలింగ్‌కు శ్రీకారం చుట్టారు. పర్యవేక్షణ మెరుగుపరచడం, నేరాలను అడ్డుకోవడం, త్వరితగతిన స్పందించి నిర్ధారించిన ప్రాంతాలకు పోలీసులు సులువుగా వెళ్లే అవకాశం ఉంటుంది.

### డ్రోన్ ఎలా పని చేస్తుంది

నగరంలో లా అండ్ ఆర్డర్ తోపాటు ట్రాఫిక్‌లో డ్రోన్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఒక్కో డ్రోన్ ధర సుమారు రూ.12 లక్షల వరకు ఉంటుందని పోలీసు వర్గాలు తెలిపాయి. డ్రోన్ కింద, హై–డెఫినిషన్ కెమెరాలు, నైట్–విజన్ వీడియో కూడా ఉంటుంది. డ్రోన్ల నుంచి వచ్చే ప్రత్యక్ష వీడియో ఫుటేజీ మొబైల్ పెట్రోలింగ్ యూనిట్లతోపాటు కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానించబడుతుంది. సున్నిత ప్రాంతాలు, రద్దీగా ఉండే ప్రాంతాలను డ్రోన్‌తో పర్యవేక్షిస్తారు. నగరంలోని రద్దీ ప్రాంతాల్లో డ్రోన్లను వినియోగించి ట్రాఫిక్ క్లియర్ చేసే అవకాశం ఉంటుంది.

### ప్రయోజనాలు..

డ్రోన్‌ల ద్వారా పండగలు, ర్యాలీలు, పార్టీల మీటింగ్‌లు, జనం గుంపులను పర్యవేక్షిస్తారు. ట్రాఫిక్ నియంత్రణ, నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు, మిస్సింగ్ అయిన వ్యక్తులు, అనుమానితుల గుర్తింపు, విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో డ్రోన్లను వినియోగిస్తారు. గతంలోనూ డ్రోన్ కెమెరాలతో పోలీసులు పర్యవేక్షణ చేసిన సందర్భాలు ఉన్నాయి.

### నేరాలకు చెక్ పడే విధంగా...

నగరంలో అర్ధరాత్రి వేళ రోడ్లపై తిరిగే వారు, గ్యాంగ్‌లు, అనుమానితులు డ్రోన్ కెమెరాలకు చిక్కడంతో వారి ఆగడాలకు చెక్ పడుతుంది. అర్ధరాత్రి వరకు గుంపులు, గుంపులుగా సమావేశమై న్యూసెన్స్ చేసే వారిని ఈజీగా గుర్తించి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. చోరీల నివారణ, దర్యాప్తులో ఉపయోగపడుతుంది. బైక్, ఆటో, కార్ల దొంగతనాలకు చెక్‌పడుతుంది. సీపీ పోతరాజు సాయిచైతన్య ఆదేశాలతో డ్రోన్‌ల పర్యవేక్షణ నగరంలో త్వరలో అందుబాటులోకి రానుంది.

### శాంతిభద్రతల పరిరక్షణకు..



డ్రోన్లను సమస్యాత్మక ప్రాంతాల్లో వినియోగిస్తాం. దీనితో తగదాలు, గుంపులు, గుంపులుగా ఉండేవారు, అర్ధరాత్రి తిరిగే ఆకతాయిలను డ్రోన్ సహాయంతో నివారించగలుగతాం. అనుమానితుల, దొంగల గుర్తింపునకు డ్రోన్లు ఉపయోగపడాతాయి. గతంలో పండగలు, ర్యాలీలు, వివిధ వాటికి డ్రోన్‌లను ఉపయోగించాం. ఇప్పుడు నగరంలో శాంతిభద్రతలకు ఉపయోగిస్తాం. – రాజావెంకట్‌రెడ్డి, ఏసీపీ, నిజామాబాద్

# టీచర్ల న్యాయపోరాటం

- రెగ్యులరైజేషన్ కోసం 16 ఏళ్లుగా ఎదురుచూపులు
- 2008–డీఎస్సీ టీచర్లకు న్యాయం దక్కేనా..
- కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఇచ్చినా తప్పని వేతన వెతలు


ధర్పల్లి ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్సీ–2008 టీచర్లు (ఫైల్)

నిజామాబాద్‌అర్బన్: పాఠాలు చెప్పాల్సిన టీచర్లు ఏళ్లుగా ఉద్యోగ భద్రత కోసం న్యాయపోరాటం చేస్తున్నారు. మరో వైపు ప్రభుత్వాన్ని తమ పరిస్థితపై అభ్యర్థిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు. ఒకే ఒక ఉత్తర్వు కారణంగా ఉపాధ్యాయ ఉద్యోగం పాగొట్టుకున్న డీఎస్సీ–2008 ఉపాధ్యాయుల పరిస్థితి ఇది. ప్రభుత్వం వారిని కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఎస్జీటీలుగా నియమించినా మూడునెలలుగా జీతాలు అందడం లేదు. ఈ నెల 26వ తేదీన వీరి భవితవ్యంపై న్యాయస్థానం తీర్పు వెలువరించనుంది.

**అనూహ్యంగా ఉద్యోగాలకు దూరం..**

2008లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇతర స్కూల్ అసిస్టెంట్ పోస్టులతోపాటు 30 వేల సెకండరీ గ్రేడ్ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. డీఎస్సీ పరీక్ష పూర్తయిన తరువాత ర్యాంకుల ప్రాతిపదికన రిజర్వేషన్ ఆధారంగా ఎస్జీటీ ఉపాధ్యాయుల ఎంపిక జాబితాను పూర్తి చేసి అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసింది. ఉపాధ్యాయ పోస్టింగులు ఇచ్చే చివరి సందర్భంలో కోర్టు తీర్పు వీరికి అశనిపాతంలా మారింది. మంజూరైన పోస్టుల్లో టీటీసీ/డీఈడీ చేసిన అభ్యర్థులకు 30 శాతం కోటా ఇవ్వాలని కోర్టు ఆదేశించడంతో వీరి ఉద్యోగజీవితాలపై చీకట్లు కమ్ముకున్నాయి.

**ఉమ్మడి జిల్లాలో 140 మంది..**

ఉమ్మడి జిల్లాలో సుమారు 140 మంది ఉద్యోగాలు కోల్పోయారు. వీరంతా ఐక్యంగా హైకోర్టులో డబ్ల్యూపీ నంబర్ 18683/2009, డబ్ల్యూపీ నంబర్ 17340/2013 కేసులు వేశారు. పట్టువదలకుండా 16 ఏళ్లుగా వీరు న్యాయపోరాటం చేస్తుండగా.. 2025 ఫిబ్రవరిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఎస్జీటీలుగా నియమించారు. తమను రెగ్యులర్ చేయాలనే వారు న్యాయపోరాటం చేస్తుండగా.. ఈనెల 26వ తేదీన హైకోర్టు ద్వారా తీర్పు వెలువడనుంది.

**మూడు నెలలుగా అందని వేతనాలు**

కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్న వారికి మూడు నెలలు గడిచినా రూ.31,040 ఫిక్స్‌డ్ వేతనం అందలేదు. కాంట్రాక్ట్ ఎస్జీటీ ఉపాధ్యాయుల్లో ఎక్కువ మంది ధర్పల్లి, సిరికొండ, భీమ్‌గల్, కమ్మర్‌పల్లి , మోర్తాడ్, సాలూర రుద్రూర్ మండలాల్లో పనిచేస్తున్నారు. ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినా ఎదురుచూపులు తప్పడం లేదు.

### ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి



16 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తరువాత మమ్మల్ని కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఎస్జీటీ ఉపాధ్యాయులుగా నియమించారు. కానీ మా పోస్టులను క్రమబద్ధీకరించి రెగ్యులర్ చేయాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నాం.
– కె గంగాధర్, ఎంపీపీఎస్ రేకులపల్లి, ధర్పల్లి

### మూడునెలలుగా జీతాలు లేవు



కాంట్రాక్ట్ ప్రాతపదికన ఎస్జీటీ ఉపాధ్యాయులుగా కొనసాగుతున్న మాకు మూడు నెలలుగా జీతాలు లేవు. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రవాణా ఖర్చులు అదనపు ఆర్థికభారంగా మారాయి.
– సురేశ్, ధనంబండ పాఠశాల, ధర్పల్లి

# పసుపు సాగులో కొత్త పుంతలు

డొంకేశ్వర్(ఆర్మూర్): యాంత్రీకరణను రైతులు అందిపుచ్చుకుంటున్నారు. కూలీలు లేకుండానే భూమిని దున్ని పసుపు విత్తనాలతోపాటు ఎరువులు కూడా వేసే పసుపు సీడర్ (యంత్రం) అందుబాటులోకి వచ్చినట్లు తెలుసుకుని డొంకేశ్వర్‌కు చెందిన బార్ల బొర్రన్న కొనుగోలు చేశాడు. రూ.1.45లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రంతో తనకున్న ఆరు ఎకరాల్లో సీడర్‌తోనే పసుపు విత్తనాలు విత్తాడు. సాధారణంగా నలుగురు కూలీలు రోజంతా రెండు ఎకరాలు విత్తనాలు వేస్తే.. ఈ యంత్రం మాత్రం కేవలం రెండున్నర గంటల్లోనే దున్నడం, విత్తనం వేయడం పూర్తి చేస్తుందని రైతు తెలిపాడు. గతేడాది కూలీల తో విత్తనాలు వేయిస్తే ఎకరానికి 25 బస్తాలు అయ్యేవని, ఇప్పుడు 16 బస్తాలే సరిపోయినట్లు చెప్పాడు. డబ్బుతోపాటు విత్తనం ఆదా అయ్యిందని సంతోషం వ్యక్తం చేశాడు.


సీడర్‌లో పసుపు విత్తనాలు పోస్తున్న రైతు బార్ల బొర్రన్న

# దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించాలి

- భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- జక్రాన్‌పల్లి, బాల్కొండ, ముప్కాల్ మండలాల్లో పరిశీలన


మాదాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

జక్రాన్‌పల్లి/బాల్కొండ: భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి స్వీకరించే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. జక్రాన్‌పల్లి మండలం మాదాపూర్, బాల్కొండ మండలం కిసాన్‌నగర్, ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్‌డెస్క్, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు.

ఒకే దరఖాస్తులో రెండు, మూడు భూ సమస్యలను పేర్కొనవచ్చని తెలిపారు. సమయపాలన పాటిస్తూ అర్జీలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇది వరకే మెండోరా మండలంలో భూ భారతి చట్టంపై పైలట్ మండలంగా ఎంపిక చేసి క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తి చేశామన్నారు. మిగ తా 32 మండలాల్లో ఈ నెల 20 వరకు రెవెన్యూ సదస్సులు పూర్తి చేస్తామన్నారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్లు కిరణ్మయి, శ్రీధర్, ముంతాజొద్దీన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# రెచ్చిపోతున్న కలప స్మగర్లు

- జిల్లాలో యథేచ్ఛగా అడవుల నరికివేత
- సిరికొండ, నిజామాబాద్ నార్త్ రేంజ్‌లలోనే ఎక్కువ
- గడిచిన ఐదు నెలల్లో 300 దుంగల పట్టివేత
- కేసులు నమోదు చేస్తున్నా జంకని టేకు దొంగలు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో కలప దొంగలు రెచ్చిపోతున్నారు. అధికారుల కళ్లుగప్పి అడవులను కొల్లగొడుతున్నారు. టేకు చెట్లను యథేచ్ఛగా నరికి దుంగలను తీసుకెళ్తున్నారు. ఎవరికీ దొరకుండా దుంగలను రహస్యంగా వ్యవసాయ బావుల్లో, గడ్డి వాముల్లో, పొదల్లో, పాడు బడిన ఇళ్లలో దాచి పెడుతున్నారు. నిజామాబాద్ సౌత్, సిరికొండ రేంజ్‌ల పరిధిలో కలప పట్టివేత కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. గడిచిన ఐదారు నెలల్లో ఆరుకు పైగా సంఘటనలు జరిగాయి. ఈ ప్రాంతాల్లో పెద్ద మొత్తంలో టేకు దుంగలు బయట పడుతుండడం అక్కడి అటవీ అధికారులు ఏ విధంగా అడవులను సంరక్షిస్తున్నారో తెలుస్తోంది. జిల్లా అటవీ విస్తీర్ణం 86,871.45 హెక్టార్లలో ఉండగా, టేకు దొరికే అడవులు మాత్రం మోపాల్, సిరికొండ, భీమ్‌గల్, కమ్మర్‌పల్లి, వర్ని మండలాల్లోనే ఎక్కువగా ఉన్నాయి. మార్కెట్‌లో టేకుకు ఎక్కువ డిమాండ్ ఉండడంతో స్మగ్లింగ్ పెరిగిపోయింది. టేకు ఎక్కువగా లభించే ఐదు మండలాల్లో అడవులన్నీ తండాలకు సమీపంలో ఉండటంతో నడి రాత్రుల్లో, తెల్లవారు సమయాల్లోనే టేకు చెట్లను ఎక్కువగా నరికివేస్తున్నారు. అధికారులు పసిగట్టే లోపే స్మగ్లరు అక్కడి నుంచి మాయమవుతున్నారు. కలప ఎవరికీ దొరకకుండా రహస్య ప్రాంతాలకు తరలించి దాచి పెడుతున్నారు. వీటిని కొంతమంది సొంతానికి వాడుకుంటుండగా, మరి కొందరు టింబర్ డిపోలు, కార్పెంటర్లకు విక్రయించి వ్యాపారం చేస్తున్నారు. మోపాల్, సిరికొండ, భీమ్‌గల్, కమ్మర్‌పల్లి, వర్ని మండలాల పరిధిలో 'జీరో' మాల్ దందా బహిరంగగా సాగేందుకు కొందరు అటవీ అధికారుల సహకారం ఉందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వాయిదాల ప్రకారం ముడుపులు తీసుకుని చూసీచూడనట్లు ఉంటున్నారనే విమర్శలు సైతం ఉన్నాయి.



ఈ ఏడాది మార్చి నెలలో మోపాల్ మండలం ఎల్లమ్మ కుంటలో 60 టేకు దుంగలను అటవీ అధికారులు పట్టుకున్నారు. ఇవి దొరికిన విధానం సేమ్ 'పుష్ప' సినిమాను తలపించింది. ఊరి బయట వ్యవసాయ బావిలో ఒక దుంగ తేలి ఉండడంతో అందులో వెతికారు. ఏకంగా 60 కలప దుంగలు దొరికాయి. అయితే దుంగలను దాచిపెట్టిన వ్యక్తులెవరో అధికారులు గుర్తించలేకపోయారు. ఇదే మోపాల్ మండలం సిర్పూర్‌లో అడవిలో టేకు స్మగ్లింగ్ జరుగుతోందనే సమాచారంతో అటవీ అధికారులు అక్కడికి వెళ్లగా స్మగ్లర్లు పారిపోయారు. అక్కడ 17 కలప దుంగలను సీజ్ చేశారు.



ఈ నెల 3వ తేదీన సిరికొండ మండలం పాకాల అటవీ సమీపంలోని మూడు ఇళ్లతోపాటు పొలాలు, గడ్డి వాముల్లో 131 టేకు దుంగలు లభించాయి. అటవీ అధికారులు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన కలప విలువ రూ.2లక్షల పైనే ఉంటుంది. ఇదే మండల పరిధిలో చీమన్‌పల్లిలో ఐదు నెలల క్రితం 86 టేకు దుంగలు పాడుబడిన ఇళ్లలో, పొదల్లో లభించాయి. వీటి విలువ సుమారు రూ.లక్షా50వేలు ఉంటుంది.

| జిల్లాలో రేంజ్‌ల వారీగా అడవుల విస్తీర్ణం(హెక్టార్లలో) | |
|---|---|
| నిజామాబాద్ నార్త్ | 6820.24 |
| నిజామాబాద్ సౌత్ | 11777.23 |
| ఇందల్వాయి | 22748.41 |
| వర్ని | 11935.17 |
| ఆర్మూర్ | 3547.56 |
| కమ్మర్‌పల్లి | 14498.13 |
| సిరికొండ | 15544.71 |

## క్లుప్తంగా

### డిగ్రీ పరీక్షల్లో ఒకరు డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో బుధవారం మోర్తాడ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు డిబార్ అయినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 32 పరీక్ష కేంద్రాల్లో 1,817 మంది విద్యార్థులకు గానూ 1,684 మంది హాజరు కాగా 133 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

### విధుల్లో చేరిన జగన్నాథచారి

డొంకేశ్వర్(ఆర్మూర్): రెండు నెలలపాటు వ్యక్తిగత సెలవుల్లో వెళ్లిన జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి బుధవారం విధుల్లో చేరారు. వచ్చిన రాగానే శాఖ ఉద్యోగులతో సమావేశం అయ్యారు. మొన్నటి వరకు ఇన్‌చార్జి జేడీగా పనిచేసిన రోహిత్‌రెడ్డి యథావిధిగా బోధన్ ఏడీఏగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

### అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రుద్రూర్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఇంగ్లిష్ మీడియంలో ఇంటర్ తరగతులు బోధించేందుకు అర్హులైన మహిళా అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారిణి శ్యామల తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, వృక్ష శాస్త్రం, జంతు శాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం సబ్జెక్టులకు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. పీజీతోపాటు బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 6 తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు దరఖాస్తులను కేజీబీవీలో అందజేయాలని సూచించారు.

### సృజనాత్మకతను వెలికితీసేందుకే సమ్మర్ క్యాంప్

- డీఈవో అశోక్



డిచ్‌పల్లి: చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సమ్మర్ క్యాంప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని డీఈవో అశోక్ పేర్కొన్నారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని మానవతా సదన్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను బుధవారం ఆయన సందర్శించారు. క్యాంప్‌లో పిల్లలు నేర్చుకుంటున్న వివిధ అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆట, పాట, జానపద నృత్యాలు, డప్పు డ్యాన్సులు, ఆర్ట్స్, క్రాఫ్ట్ అలంకరణ వస్తువుల తయారీ, గ్లాస్ పెయింటింగ్స్ తదితర అంశాల్లో నిష్ణాతులతో శిక్షణ నిర్వహించడం హర్షణీయమన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 45 రోజుల పాటు సమ్మర్ క్యాంప్ కొనసాగుతుందన్నారు. చదువులో వెనకబడకుండా విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా 'ఎడ్యు క్లినిక్' పేరిట ప్రత్యేక కార్యక్రమం రూపొందించారు. కార్యక్రమంలో సదన్ లైజనింగ్ ఆఫీసర్ పీ సుధాకర్‌రావు, కేర్ టేకర్ రమేశ్, సిబ్బంది సంధ్యారాణి, ట్యూటర్స్ స్రవంతి, విజయలక్ష్మి , రాజ్యలక్ష్మి, మహమ్మద్ అబ్దుల్ పాషా, నృత్య శిక్షకులు బైర అజయ్, సింగర్ నాగుల మమత తదితరులు పాల్గొన్నారు.

### మంజీరలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పిట్లం(జుక్కల్): మండలంలోని మద్దెలచెర్వు గ్రామ శివారులోని మంజీరా నదిలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్సై రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడికి సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయసు ఉంటుందని, ఒంటిపై తెలుపు రంగు అంగీ, తెలుపు రంగు ధోవతి ఉందని, 2 నుంచి 4 రోజుల క్రితం చనిపోయినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 8712686171, 8712686170 నంబర్లకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

# అవనికి ఆపద.. ఆపాలి తప్పక

- సమష్టిగా ముప్పును తప్పిద్దాం
- పాలిథిన్ నియంత్రణతోనే పల్లెలకు జీవం
- రసాయన ఎరువుల వాడకం తగ్గాలి
- హరితహారం కావాలి.. పచ్చతోరణం



మురికి కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు

**నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం**

కమ్మర్‌పల్లి: ప్రకృతి అందాలను కోల్పోతోంది... భూమాత క్షోభిస్తుంది. రోజు రోజుకూ పెరుగుతున్న పాలిథిన్ వినియోగంతో పర్యావరణంలో సమతుల్యత దెబ్బతింటోంది. విచ్చలవిడిగా అడవులను నరికి వేస్తుండటంతో వాతావరణ మార్పులు సంభవించి.. భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. అధిక దిగుబడి కోసం రైతులు అవసరానికి మించి రసాయన ఎరువులు వాడుతున్నారు. భూగోళం భస్మీపటలం కాకముందే మనమంతా కళ్లు తెరవాలి. 'ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్‌ను నిషేదిద్దాం' అని ఐక్యరాజ్యసమితి ఇటీవల పిలుపు ఇచ్చిన నేపథ్యంలో లక్ష్య సాధనలో అందరూ భాగస్వామ్యం కావాలి. నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కథనం...

### విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడకం



**సేంద్రియమే సేఫ్**

పంట దిగుబడుల కోసం మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడటంతో భూసారం, పర్యావరణం దెబ్బతింటోంది. పచ్చని పొలాలపై పురుగుల మందులు ఎక్కువగా పిచికారీ చేస్తుండడంతో ప్రకృతి రీత్యా లభించే ఫలాలు విషతుల్యం అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 10.20 లక్షల సాగు విస్తీర్ణం ఉండగా, ఏటా 22.5 లక్షల లీటర్ల పురుగుల మందులు, 3.93 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు వాడుతున్నారు. అతిగా ఎరువుల వాడకంతో భూసారం తగ్గడమే కాకుండా మిత్ర పురుగుల సంతతి నశించి కాలుష్యం పెరుగుతోంది. ఎరువుల వాడకాన్ని తగ్గించాలి.

### గుట్టలుగా ప్లాస్టిక్

**ప్లాస్టిక్ వినియోగం ఆగాలి**

ఉమ్మడి జిల్లాలో 9 నియోజకవర్గాలు, 55 మండలాలు, 1056 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత పదేళ్లుగా ప్లాస్టిక్ వినియోగం 50 శాతం పెరిగింది. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ సంచులు, చెత్త గుట్టలుగా పేరుకు పోతున్నాయి. భూమి లోనికి నీరు ఇంకే అవకాశం లేకుండా చేస్తున్నాయి. దీంతో మొక్కల పెరుగుదల ఆగిపోతోందని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఆవులు, ఇతర జంతువులు తిని జీర్ణం కాకపోవడం మృత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్‌ను కాలుస్తుండడంతో వెలువడే బయాక్సిన్, ఫూన్పిరాన్ వంటి విషవాయువులు క్యాన్సర్‌కు దారితీస్తున్నాయి.

### తరుగుతున్న అడవులు



**మొక్కలను పెంచుదాం**

జాతీయ అటవీ విస్తీర్ణం ప్రకారం భూ విస్తీర్ణంలో 33 శాతం అడవులు ఉండాలి. ఉమ్మడి జిల్లా వైశాల్యం 7956 చదరపు కిలోమీటర్లు కాగా, అడవులు మాత్రం 1196.29 చదరపు కిలోమీటర్లు వ్యాపించి ఉన్నాయి. ఇవి జిల్లా విస్తీర్ణంలో 23 శాతం మాత్రమే. సిరికొండ, ఇందల్‌వాయి, ఎల్లారెడ్డి, బాన్సువాడ అటవీ క్షేత్ర పరిధిలో గత పదేళ్లలో అడవుల విస్తీర్ణం బాగా తగ్గినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఏటా ఉమ్మడి జిల్లాలో అడవుల సంరక్షణ కోసం 'కంపా' పథకం కింద రూ. 4.20 కోట్లు కేటాయిస్తున్నా గత రెండేళ్లలో అడవుల విస్తీర్ణం 0.929 శాతం మాత్రమే పెరిగింది.

### పీవోపీతో ముప్పు..



**మట్టి ప్రతిమలను పూజిద్దాం**

కాలుష్యానికి దారితీసే ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీవోపీ) మిశ్రమాన్ని వినాయక ప్రతిమల తయారీలో వాడటంతో పర్యావరణం దెబ్బతింటోంది. 300 డిగ్రీల ఫారిన్‌హీట్ వద్ద రసాయనాలను వేడి చేయడంతో పీవోపీ మిశ్రమం తయారవుతుంది. వీటితో రూపొందించే ప్రతిమలను చెరువులు వాగులు, నదులలో నిమజ్జనం చేయడంతో అందులో నివసించే జీవచరాలు చనిపోతున్నాయి.

### విద్యార్థి దశ నుంచే అవగాహన..

**పర్యావరణాన్ని కాపాడుకుందాం**

పర్యావరణ విద్యపై విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం పర్యావరణ విద్యను ప్రవేశపెట్టింది. దీని కోసం ప్రత్యేకంగా సబ్జెక్టులను రూపొందించి పుస్తకాలను సైతం అందజేసింది. ఉపాధ్యాయులు వివిధ కృత్యాలు, ప్రయోగాల ద్వారా పిల్లలకు బోధిస్తే మంచి అవగాహన కలుగుతుంది. ఉన్నత పాఠశాలల్లో జాతీయ గ్రీన్ కోర్ ఏర్పాటు చేసి పర్యావరణంపై అవగాహన కల్పించాలి.

### అవగాహన పెంచాలి



ప్రాథమిక స్థాయి నుంచి పిల్లలకు పర్యావరణంపై అవగాహన కల్పించాలి. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను వివరిస్తే వారు వాడకుండా నివారించవచ్చు. రైతులు మితిమీరి రసాయనిక ఎరువులు వాడకుండా వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలి.

– పెద్ది మురళి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

## పర్యావరణ పరిరక్షణలో..చిత్రకారుడు

వర్ని: సమాజం ఎటు పోతే నాకేంటి.. మనం బాగుంటే చాలు అనే నేటి రోజుల్లో ఓ చిత్రకారుడు పర్యావరణ పరిరక్షణ కోసం తనవంతు బాధ్యతగా వ్యవహరిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. వర్ని మండలం పాత వర్ని గ్రామానికి చెందిన ఇందూరి బల్‌వీర్. చిత్ర కళ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఖాళీ సమయాల్లో ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు గోడలు, కల్వర్టులు, రహదారుల వెంబడి ఖాళీ ప్రదేశాలల్లో పర్యావరణ పరిరక్షణ నినాదాలు రాస్తూ అందరినీ ఆలోచింపజేస్తున్నాడు.




మల్లారం అటవీ ప్రాంతంలో బండరాయిపై నినాదాలు రాస్తున్న బల్ వీర్

### మార్పు వస్తుందనే..



నా ప్రయత్నంతో ప్రజల్లో కొంత మేరకు మార్పు వస్తుందని ఆశిస్తున్నా. కంటికి కనిపించే ఖాళీ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ కోసం నినాదాలు రాస్తున్నాను. కలర్, బ్రష్, నా వెంటే ఉంచుకుంటూ ఖాళీ ప్రదేశంలో నినాదాలు రాస్తాను.

– ఇందూరి బల్‌వీర్

## అర్గుల్ రాజారాం (గుత్ప) ఎత్తిపోతల పథకం

**మీకు తెలుసా?**



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌ను ఎత్తిపోతల పథకం ద్వారా మళ్లించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.204 కోట్ల వ్యయంతో నిర్మాణం పనులు చేపట్టి పూర్తి చేయించారు.

- 2008 మార్చి 18న వైఎస్సార్ స్వహస్తాలతో అర్గుల్ రాజారాం (గుత్ప) ఎత్తిపోతల పథకంగా నామకరణం చేసి ప్రారంభించారు.
- ఆర్మూర్ ప్రాంత బీసీ నాయకుడు, మాజీ మంత్రి అర్గుల్ రాజారాంకు ఇచ్చిన అరుదైన గౌరవం ఇది.
- ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల పరిధిలోని మాక్లూర్, నందిపేట్, ఆర్మూర్, బాల్కొండ, వేల్పూర్, జక్రాన్‌పల్లి మండలాల్లోని 53 గ్రామాల్లో 38 వేల 792 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ అయింది.
- నందిపేట మండలం ఉమ్మెడ శివారులో నిర్మించిన ఎత్తిపోతల పథకం ద్వారా శ్రీరాం సాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్‌లోని గోదావరి నదీ జలాలు 22.5 కిలోమీటర్ల దూరం ప్రయాణించి గుత్ప చెరువు మీదుగా ఆర్మూర్ ప్రాంత వ్యవసాయ భూములకు అందుతుండటంతో రైతులు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

– ఆర్మూర్

### అత్యవసర సేవల టోల్ ఫ్రీ నంబర్లు

| | |
|---|---|
| విద్యుత్ | 1912 |
| పోలీస్ | 112,100 |
| అగ్నిమాపక | 101 |
| అంబులెన్స్ | 102, 108 |
| రైల్వే విచారణ | 139 |
| అవినీతి నిరోధక శాఖ | 1031 |
| రోడ్డు ప్రమాదం | 1073 |
| సైబర్ క్రైమ్ | 1930 |

– ఖలీల్‌వాడీ

## చిరుప్రాయంలో అంతర్జాతీయ గుర్తింపు

- ఆంధ్ర నాట్యం, కూచిపూడిలో తనకంటూ ప్రత్యేకత
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 80కి పైగా ప్రదర్శనలు

**లోకల్ టాలెంట్**



బాశెట్టి సాయి శృతి, ఆర్మూర్

ఆర్మూర్: ఆర్మూర్ పట్టణానికి చెందిన బాశెట్టి సాయి శృతి.. చిన్నతనం నుంచే ఆంధ్ర నాట్యం, కూచిపూడి ప్రదర్శనలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించింది. తల్లి నటరాజ నృత్యానికేతన్ నాట్య గురువు బాశెట్టి మృణాళిని శిష్యరికంలో ఐదేళ్ల నుంచే నాట్యాన్ని అభ్యసించడం మొదలుపెట్టింది. ప్రస్తుతం 13 ఏళ్ల సాయిశృతి తొమ్మిదో తరగతి చదువుతూ తను అనుకున్న లక్ష్యాలను సాధిస్తోంది. ఆంధ్ర నాట్యం, కూచిపూడిలో భూషణ్ పరీక్షలను పూర్తి చేసుకొని రెండేళ్ల డిప్లొమా సైతం పూర్తి చేసుకోనుంది. ఇప్పటి వరకు గోల్డెన్ టెంపుల్, కాశీ, కాణిపాకం, తిరుపతి, శ్రీశైలం, స్వర్ణగిరి, యాదగిరిగుట్ట, హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, అన్నవరం, బెంగళూరు, ఢిల్లీ, మలేషియా, దుబాయ్‌తో పాటు పలుచోట్ల సుమారు 80కి పైగా ప్రదర్శనలు ఇచ్చింది. చక్కని ప్రతిభ కనబర్చి నంది అవార్డు, కళాభారతి, నాట్య మయూరి, నాట్య విభూషణ్, నాట్య కుసుమం అవార్డులతోపాటు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్, లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్, స్పిరిచువల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లలో చోటు దక్కించుకుంది. విదేశాల్లో ఉన్న చిన్నారులకు ఆన్‌లైన్‌లో నృత్యాన్ని నేర్పిస్తూ చిరుప్రాయంలోనే సహాయ నాట్య గురువుగా అవార్డును అందుకుంది.

## ర్యాపిడ్ టీం అందుబాటులో ఉండాలి

- జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ

బోధన్‌టౌన్(బోధన్): డివిజన్‌లోని ప్రతీ పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలో ర్యాపిడ్ టీం అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ పేర్కొన్నారు. పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో ఉన్న బస్తీ దవాఖానలో డివిజన్ స్థాయి వైద్యాధికారులు, పర్యవేక్షణ సిబ్బందితో బుధవారం కీటక జనిత వ్యాధుల నివారణ, నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్ స్థాయిలో హైరిస్క్ ఏరియాలను గుర్తించి నియంత్రణ, నివారణ చర్యలతోపాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పారామెడికల్ సిబ్బంది సమయపాలన పాటించాలని, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లోని సిబ్బంది టూర్ డైరీ, అడ్వాన్స్ టూర్ ప్రోగ్రాం తయారు చేసి త్వరితగతిన అందజేయాలని సూచించారు. గ్రామాల్లో డెంగీ కేసులు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో మమత, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**స్కానింగ్ సెంటర్ సీజ్**

పట్టణంలోని క్లారిటీ సిటీ స్కాన్ సెంటర్‌ను డీఎంహెచ్‌వో రాజశ్రీ బుధవారం సీజ్ చేశారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌తోపాటు రికార్డులు, డాక్టర్ కన్సల్టెంట్, ధరల బోర్డు లేదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా స్కాన్ సెంటర్లు, డయాగ్నోస్టిక్ సెంటర్లను నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**క్రైం కార్నర్**

## ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కన్కల్ గ్రామానికి చెందిన కురుమ మల్లేశ్ (52)ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మురళి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మల్లేశ్ తన ముగ్గురి కూతుళ్ల పెళ్లి చేయడమే కాకుండా తన వ్యవసాయ భూమి పక్కన ఇతరుల నుంచి కొంత భూమిని కొనుగోలు చేశాడు. అప్పులపాలు కావడంతో జీవితంపై విరక్తితో మల్లేశ్ మంగళవారం గ్రామశివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటి నుంచి వెళ్లిన మల్లేశ్ రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో మంగళవారం రాత్రి కులస్తుల సహకారంతో గ్రామ శివారులో వెతకగా ఓ చెట్టుకు శవమై కనిపించాడన్నారు. భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

### పోక్సో కేసు నమోదు

నిజామాబాద్ రూరల్: మోపాల్ మండలంలోని ఒక గ్రామంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి సీఐ సతీశ్ తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి బాలికపై బాలుడు అత్యాచారం యత్నానికి పాల్పడినట్లు స్థానికులు వివరించారు.

### చికిత్స పొందుతూ ఒకరి మృతి

సదాశివనగర్: మండల కేంద్రంలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కుర్మ గంగమల్లు(39) నాలుగేళ్ల క్రితం బతుకుదెరువు కోసం విదేశాలకు వెళ్లి తిరిగొచ్చాడు. తనకున్న ఎకరం 30 గుంటల భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల తన భూమిని ప్రైవేట్ సర్వేయర్‌తో సర్వే చేయించగా మూడు గుంటల భూమి తక్కువ వచ్చింది. దీంతో మనస్తాపం చెందిన గంగమల్లు మంగళవారం బావి వద్ద గడ్డిమందును సేవించి, ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. అపస్మారక స్థితిలో ఉన్న గంగమల్లును మొదట కామారెడ్డి ఆస్పత్రికి, తర్వాత ఎల్లారెడ్డిపేట్ అశ్విని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ



చోరీ జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కిరణ్

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని యోగేశ్వర కాలనీలో తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన సీతాపవర్ అమరనాథ్ కుటుంబసభ్యులతో కలిసి గత నెల 31న హైదరాబాద్‌కు వెళ్లారు. బుధవారం తిరిగి ఇంటికి వచ్చి చూస్తే తాళం పగులగొట్టి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. 12 గ్రాముల బంగారం, రూ.11 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు.

### ముగ్గురిపై కేసు నమోదు

నిజామాబాద్ రూరల్: మోపాల్ మండలం సిర్‌పూర్ శివారులో ఉన్న బాలయోగి అవధూత నిర్మలానంద స్వామి ఆశ్రమంలోని కుటీరం దగ్ధంపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ బుధవారం పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### తహసీల్దార్‌కు గాయాలు

- కారును ఢీకొన్న డీసీఎం వ్యాన్



ప్రమాదంలో ధ్వంసమైన కారు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని అంజనీ చౌరస్తా సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. జుక్కల్ తహసీల్దార్ మహేందర్ కుమార్ పిట్లం నుంచి తన కారులో జుక్కల్‌కు వెళ్తుండగా పెద్దకొడప్‌గల్ మండలంలోని అంజనీ చౌరస్తా సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం వ్యాన్.. కారును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న తహసీల్దార్ మహేందర్‌కుమార్, డీసీఎం డ్రైవర్ ఖలీద్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తహసీల్దార్‌ను హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. రెవెన్యూ సిబ్బంది నాగునాథ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

### బంగారంతో పరారైన వర్కర్

ఖలీల్‌వాడి: ఆభరణాల తయారీకి ఇచ్చిన 15 తులాల బంగారం తీసుకొని ఓ వర్కర్ పరారైన ఘటన నగరంలోని ఒకటో టౌన్‌లో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కలకత్తాకు చెందిన మహమ్మద్ మజిల్ పదేళ్లుగా నగరంలో గోల్డ్ పనులు చేస్తున్నాడు. అతని వద్ద కలకత్తా నుంచి బాబాన్ హాల్దర్ నాలుగేళ్లుగా ఆభరణాల తయారీ పనులు చేస్తున్నాడు. పనిలో భాగంగా మహమ్మద్ మజిల్ ఇచ్చిన 15 తులాల బంగారం తీసుకొని హాల్దర్ పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## రెండేళ్ల బాలుడి కిడ్నాప్.. మూడు గంటల్లో ఛేదన

- దంపతుల అరెస్ట్



సీసీ ఫుటేజీలో రికార్డయిన దృశ్యాలు



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న ఏఎస్పీ చైతన్య రెడ్డి

కామారెడ్డి క్రైం: రెండేళ్ల బాలుడి కిడ్నాప్ కేసును కామారెడ్డి పోలీసులు మూడు గంటల్లోనే ఛేదించారు. పడుకున్న చోటు నుంచి బాలుడిని కిడ్నాప్ చేసిన దంపతులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ చైతన్య రెడ్డి వివరాలు వెల్లడించారు. భిక్కనూర్ మండలం గుర్జకుంట గ్రామానికి చెందిన మక్కాల లక్ష్మి, నర్సింలుకు కుమార్తె, కుమారుడు హర్షిత్ (2) ఉన్నారు. కొంతకాలంగా కామారెడ్డిలో భిక్షాటన చేస్తూ సిరిసిల్ల రోడ్డు ప్రాంతంలోని దుకాణాల ఎదుట నిద్రిస్తుంటారు. మంగళవారం రాత్రి ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ఎదుట తమ పిల్లలతో కలిసి నిద్రించారు. ఉదయం లేచి చూడగా హర్షిత్ కనిపించలేదు. చుట్టపక్కల గాలించినా దొరకలేదు. బాలుడిని కిడ్నాప్ చేశారని గ్రహించి పట్టణ పోలీసులను ఆశ్రయించారు. అప్రమత్తమైన పోలీసులు బాలుడి ఆచూకీ కోసం 3 బృందాలను ఏర్పాటు చేసి విచారణ ప్రారంభించారు. ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించగా బాలుడిని ఓ మగ వ్యక్తి, ఓ మహిళ కలిసి ఎత్తుకెళుతున్నట్లు గుర్తించారు. అన్ని కోణాల్లో విచారణ జరుపగా వారిని దోమకొండకు చెందిన పల్లపు రాజు, అతని భార్య శారదగా నిర్ధారించారు. నిందితులు సైతం పట్టణంలో భిక్షాటన చేస్తూ ఉంటారని తేలింది. దీంతో పట్టణంలో గాలింపు చర్యలు చేపట్టి కామారెడ్డి రైల్వేస్టేషన్ వద్ద బాలుడితో కలిసి భిక్షాటన చేసుండగా పట్టుకున్నారు. హర్షిత్‌ను తల్లిదండ్రులకు అప్పగించి నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సై శ్రీరాం, కానిస్టేబుళ్లు విశ్వనాథ్, విజయ్, రాజు, నరేశ్, రవి, అశ్విన్‌ను అభినందించారు.

### సిగరెట్ల వాహనం పట్టివేత

ఖలీల్‌వాడి: జీఎస్టీ లేకుండా తరలిస్తున్న సిగరెట్ల వాహనాన్ని పట్టుకున్నట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. మంగళవారం రాత్రి మహారాష్ట్ర నుంచి నిజామాబాద్‌కు సిగరెట్ల బాక్స్‌లను వాహనంలో తరలిస్తుండగా పట్టుకొని విచారించారు. జీఎస్టీ వివరాలు లేకపోవడంతో వాణిజ్య పన్నుల అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

## సీఐ పేరిట వసూళ్లు!

- ఆర్మూర్ సబ్ డివిజన్‌లో హోంగార్డు నిర్వాకం

ఖలీల్‌వాడి: ఆర్మూర్ సబ్ డివిజన్ పరిధిలోని ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పేరు చెప్పి హోంగార్డు వసూళ్ల దందాకు తెరలేపారు. తన ఇంటికి అవసరమైన సిలిండర్‌తోపాటు ఇతర వస్తువులను సీఐ పంపమన్నారని చెప్పడంతో సదరు దుకాణాలకు చెందిన వారు మిన్నకుండిపోయారు. ఇదిలా ఉండగా సీఐ వద్ద వివిధ పనుల కోసం వచ్చే వారితోపాటు పంచాయితీలకు వచ్చే వారి నుంచి రూ. 2 వేల నుంచి రూ. 5 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. సీఐ కార్యాలయంలో అన్నీతానై వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

**భీమ్‌గల్ సర్కిల్‌లో కానిస్టేబుల్..**

భీమ్‌గల్ సర్కిల్ పరిధిలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో ఇంటెలిజెన్స్‌లో పనిచేసే కానిస్టేబుల్.. భార్యాభర్తల పంచాయితీలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఆ స్టేషన్ ఎస్సై కౌన్సెలింగ్ ఇస్తున్న సమయంలో ఇంటెలిజెన్స్‌కు చెందిన కానిస్టేబుల్ అక్కడ ప్రత్యక్షం అయ్యాడు. దీంతో ఇక్కడికి ఎందుకు వచ్చావని కానిస్టేబుల్‌ను ఎస్సై ప్రశ్నించినట్లు తెలిసింది. ఇదే కాకుండా సదరు పోలీస్‌స్టేషన్‌లో కొన్నేళ్లుగా పనిచేస్తున్న రైటర్లు సైతం ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు ప్రచారంలో ఉంది.